# అమెరికా పౌరసత్వం కావాలా..?



**అమెరికాలో ఉన్న వనరులు, అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఏదో ఒక విధంగా అమెరికాకు చేరుకొని, పౌరసత్వాన్ని పొంది స్థిర నివాసం ఏర్పరుచుకోవాలని కలలు కంటుంటారు. అయితే కొందరు మాత్రమే ఆ కలను సాకారం చేసుకోగలుగుతారు. ఉదాహరణకు.. 2016 సంవత్సరంలో దాదాపుగా పది లక్షల మంది అమెరికా పౌరసత్వానికై దరఖాస్తు చేసుకోగా ఏడు లక్షల యాభై రెండు వేల ఎనిమిది వందల మందికి అమెరికా దేశపౌరసత్వం లభించింది. ఇంతకీ అమెరికా పౌరసత్వం పొందడం ఎలా? ఆ విషయాన్ని తానా మాజీ అధ్యక్షుడు తోటకూరప్రసాద్ వివరిస్తున్నారిలా..**

## మూడు రకాలుగా చాన్స్

అమెరికా దేశపు పౌరసత్వాన్ని మూడు రకాలుగా పొందే అవకాశం ఉంది. అవేంటంటే..

### అమెరికాలో జన్మించడం ద్వారా

అమెరికా దేశంలోని ఏ రాష్ట్రంలో జన్మించినా లేదా అమెరికా ఆధీనంలో ఉన్న పోర్టోరీకో, గ్వామ్, యూ.ఎస్. వర్జిన్ ఐలాండ్స్, మరియునార్తర్న్ మరయానా ఐలాండ్స్‌లో 1986 తరువాత జన్మించినా అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

### వారసత్వపు హక్కు..

అమెరికా పౌరులైన దంపతులకు (కనీసం ఒకరు అమెరికా (గతం)లో గాని ప్రస్తుతం గాని నివాసం ఉండి ఉండాలి) జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

- దంపతులలో ఒకరికి మాత్రమే అమెరికా పౌరసత్వం ఉంటే.. వారు పిల్లలు పుట్టే సమయానికి కనీసం 5 సంవత్సరాలు అమెరికాలో నివసించి ఉండి ఉండాలి. అందులో 2 సంవత్సరాలు.. 14 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత అమెరికాలో ఉన్నట్లు రుజువు చేసుకోవాలి. అప్పుడే వారికి పుట్టిన పిల్లలకు పౌరసత్వం లభిస్తుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం ఐదేళ్ల కాలపరిమితిలో కొన్ని మినహాయింపులుంటాయి.
- తల్లికి అమెరికా పౌరసత్వం ఉండి తండ్రికి లేకపోయినా పుట్టిన పిల్లలకు పౌరసత్వం లభిస్తుంది. అయితే, పిల్లలు పుట్టే సమయానికి ఏడాది ముందు తల్లి అమెరికాలో నివసించి లేదా నివసిస్తూ ఉండాలి.
- తండ్రి అమెరికా పౌరుడై ఉండి తల్లి కాకపోతే? పుట్టిన శిశువుకు తానే తండ్రినని, బిడ్డకు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని తండ్రి రాతపూర్వకంగా తెలిపితే పౌరసత్వం లభిస్తుంది.

### తగిన అర్హతలు సంపాదించడం ద్వారా (ఎన్-600)..

పైన పేర్కొన్న రెండు వర్గాలకూ చెందక.. అమెరికా పౌరసత్వం కోరుకునేవారు కనీసం 5 సంవత్సరాలు పాటు గ్రీన్ కార్డు కలిగి ఉండాలి. ఆ ఐదేళ్లలో కనీసం 30 నెలల పాటు అమెరికాలోనే ఉండి ఉండాలి.

- 18 సంవత్సరాల వయసు నిండి ఉండాలి.
- పౌరసత్వం కోసం దరఖాస్తు చేసేనాటికీ కనీసం 3 నెలలు ముందుకాలం అమెరికాలో ఉండి ఉండాలి.
- దరఖాస్తు చేసిన నాటి నుంచి పొందే వరకూ అమెరికాలోనే ఉండాలి (సెలవులపై విదేశీ ప్రయాణాలు చేయొచ్చు).
- అమెరికా దేశపు చరిత్ర, ప్రభుత్వ పరిపాలనావిధానం తెలిసి ఉండి ఆంగ్ల భాష చదవడం, రాయడం, మాట్లాడటం కొంత వరకైనా వచ్చి ఉండాలి.
- అమెరికా రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవిస్తూ, బాధ్యతాయుత వ్యక్తిగా ఉండాలి.

### వివాహం..

అమెరికా పౌరసత్వం ఉన్నవారిని వివాహం చేసుకున్నాక పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేవారు.. కనీసం 3 సంవత్సరాల పాటు గ్రీన్ కార్డు కలిగి ఉండాలి. ఆ మూడేళ్లలో 18 నెలలపాటు.. దరఖాస్తు సమయానికి ముందు కనీసం 3 నెలల కాలం అమెరికాలో ఉండి ఉండాలి.

- ఆ మూడేళ్ల కాలం పూర్తయి పౌరసత్వం కోసం దరఖాస్తు చేసి పౌరసత్వం పొందే వరకు వైవాహిక బంధంలోనే ఉండి ఉండాలి. దరఖాస్తు చేసిన నాటి నుంచి పౌరసత్వం పొందే వరకు అమెరికా దేశంలో నివసించాలి. సెలవుపై విదేశీ ప్రయాణాలు చేయొచ్చు.

## గ్రీన్ కార్డు పొందేందుకు కావాల్సిన అర్హతలు (ఏ-485)

కుటుంబ బంధం ద్వారా, ఉద్యోగం ద్వారా, పెట్టుబడి పెట్టడం ద్వారా, ప్రత్యేక పరిస్థితుల్లో, శరణార్థులు/కాందిశీకులుగా, లాటరీ పద్ధతి ద్వారా, పేర్లునమోదు చేసుకోవడం ద్వారా గ్రీన్ కార్డు పొందవచ్చు. మరింత వివరంగా చెప్పాలంటే..

### కుటుంబ బంధం ద్వారా గ్రీన్ కార్డు

అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్ కార్డు ఉన్నవారితో వివాహం జరిగితే గ్రీన్‌కార్డుకు అర్హులు.

- తల్లిదండ్రులు అమెరికా పౌరులు లేదా గ్రీన్ కార్డు ఉన్నవారు అయితే ( ఒకవేళ తల్లిదండ్రులు గ్రీన్ కార్డు ఉన్న వారు అయితే, వారి పిల్లలు అవివాహితులుగా ఉన్నప్పుడు మాత్రమే అర్హులు)
- కనీసం 21 సంవత్సరాల వయస్సున్న సోదరుడు లేదా సోదరి అమెరికా దేశపు పౌరులై ఉంటే.
- అమెరికా పౌరసత్వం ఉన్నవారితో పెళ్లి నిశ్చయమైతే
- తల్లి లేదా తండ్రికి అమెరికా పౌరసత్వం కలిగిన వారితో వివాహం నిశ్చయమైనప్పుడు, పిల్లలు కూడా గ్రీన్ కార్డుకు అర్హులే.

### శరణార్థులు లేదా కాందిశీకులకు గ్రీన్ కార్డు

అమెరికా ప్రభుత్వం నుంచి శరణార్థులు లేదా కాందిశీకులుగా గుర్తింపు పొందిన ఒకసంవత్సర కాలం తరువాత వారు గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

### ప్రత్యేక పరిస్థితుల్లో గ్రీన్ కార్డు

అమెరికాలోని లాభాపేక్ష రహిత, మతపరమైన సంస్థల్లో పని చేయడం ద్వారా.

- విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన వారు
- అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు
- అమెరికా దేశపు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇతర దేశం నుంచి వచ్చి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

### ఉద్యోగం ద్వారా గ్రీన్ కార్డు

వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారి యాజమాన్యం ద్వారా గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, అమెరికాలో కనీసం 5 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి కనీసం 5 ఉద్యోగాలను కల్పించడం ద్వారా లేదా 10 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి కనీసం 10 ఉద్యోగాలను కల్పించడం ద్వారా గ్రీన్‌కార్డు పొందవచ్చు.

### లాటరీ పద్ధతి ద్వారా గ్రీన్ కార్డు

కనీసం హైస్కూల్ స్థాయి విద్యార్హత కల్గి ఉండి (లేదా) గడిచిన ఐదేళ్లలో రెండేళ్ల అమెరికాలో ఏదైనా ఉద్యోగం చేసిన వారు ఈ విధానంలో గ్రీన్‌కార్డుకు అర్హులు. అమెరికాకు తక్కువ వలసలు ఉండే దేశాల వారికే ప్రాధాన్యమిస్తారు. సాధారణంగా ప్రతి అక్టోబరులో లాటరీద్వారా 55,000 వరకు గ్రీన్ కార్డులను జారీ చేస్తారు.

### పేర్లునమోదు చేసుకోవడం ద్వారా గ్రీన్ కార్డు

1972 జనవరి 1కి ముందు అమెరికాలో ప్రవేశించి, అమెరికా పౌరసత్వం పొందడానికి అర్హులైతే ప్రత్యేకంగా నమోదు చేసుకోవడం ద్వారా గ్రీన్ కార్డు పొందవచ్చు.